క్లుప్తంగా

డెంగీ పట్ల అప్రమత్తత అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గంట్యాడ: డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్.కోట సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో డెంగీ వ్యాధిపై గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమ కాటు వల్ల డెంగీ వ్యాప్తి చెందుతుందన్నారు. నివాసితులు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ కె.తిరుపతినాయుడు, ఎంఎల్‌పీ అనూష, ఏఎన్‌ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగు పరిశీలన



బొద్దాంలో నవధాన్యాల సాగును పరిశీలించిన డీపీఎం

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి పంచాయతీలో సాగు చేస్తున్న నవధాన్యాల సాగును ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.ఆనందరావు గురువారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో సాగు పరిశీలించిన ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగువల్ల ఎరువులు ఖర్చు తగ్గుతుందన్నారు భూమిలో జీవవైవిధ్యం పెరిగి వివిధ రకాల పోషకాలను పంటకు అందించటం వల్ల పంట దిగుబడి పెరుగుతుందన్నారు. రైతాంగం నవధాన్యాల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కో ఆర్డినేటర్ వెంకటరావు, మాస్టర్ ట్రైనర్ ఈశ్వర్రావు, యూనిట్ ఇంచార్జి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల తీరును గమనిస్తుండాలి..



కెల్ల హైస్కూల్‌లో తల్లిదండ్రులు సమావేశంలో మాట్లాడుతున్న కె.వి.సూర్యనారాయణ రాజు

గుర్ల: విద్యార్థుల తీరును తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కె.వి.సూర్యనారాయణ రాజు అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, కెల్ల హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణగా ఉండాలని , పాఠశాలలో విద్యార్థులకు సమస్యలు ఉంటే తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎస్‌వో జానకి, స్థానిక నేతలు ఇజ్జిరోతు ప్రసాద్, మంత్రి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్‌తో వరినాట్లు మేలు

లక్కవరపుకోట : డ్రమ్ సీడర్‌లతో వరి నాట్లు వేయడం వలన విత్తన మిగులుతో పాటూ కూలీ ఖర్చులు తగ్గడంతో పాటూ అధిక దిగుబడులు వచ్చే అవకాశం వుందని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఆనందరావు తెలిపారు. మండలంలోని సంతపేట గ్రామంలో డ్రమ్ముసీడర్‌తో వేస్తున్న వరినాట్లును ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. డ్రమ్ సీడర్‌తో వేసిన వరి పొలంలో కలుపు నివారణకు పప్పు జాతులకు చెందిన పెసలు, బొబ్బర్లు, ఉలవులు తదితర అంతర్ పంటలు వేయడం వలన కలుపు నివారణ చేసుకోవచ్చన్నారు. కూలీలు ఖర్చులు, ఎరువుల భారం రైతులకు తగ్గుతుందన్నారు. ఈ పంట సాగు వలన అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది బి.జానకి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వైద్యసేవలు



బల్లంకిలో పశువులకు వైద్యసేవలు అందిస్తున్న డా. గాయిత్రీ

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో గురువారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో 85 పశువులకు వైద్యసేవలు అందించారు. పశు వైద్యాధికారిణి డా.గాయిత్రీ ఆధ్వర్యంలో పశుగ్రాస వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంతో పాటు పశుగ్రాసంపై అవగాహన కార్యక్రమంలో ఎస్.కోట ఏడీఏ డా.చలపతిరావు పాల్గొన్నారు. పశుగ్రాస ప్రాముఖ్యత, సాగుపై రైతులకు ఏడీఏ వివరించారు. రైతులకు బోవిటకే ప్యాకెట్లను అందజేశారు. గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకున్న రైతులు

- పంట పొలాలకు వేసుకున్న రోడ్డును ఎలా తవ్వేస్తారని నిలదీత
- తప్పుడు ఫిర్యాదులిచ్చే వ్యక్తులపై పోలీసులకు ఎదురు ఫిర్యాదు



రోడ్డును తవ్వేందుకు జేసీబీతో వచ్చిన అధికారులను అడ్డుకున్న రైతులు

కొత్తవలస : పంట పొలాలకు రాకపోకలతో పాటూ పంటలను తెచ్చుకునేందుకు, మరో గ్రామానికి అనుసంధానం చేస్తూ ఉన్న రోడ్డును ఎలా తవ్వేస్తారని రైతులు అధికారులను నిలదీశారు. రైతులు సొంతంగా చందాలు వేసుకొని రోడ్డు వేసుకుంటే ఎవరో తప్పుడు ఫిర్యాదు చేస్తే అధికారులు కూటమి నేతల కనుసన్నల్లో పని చేస్తూ జేసీబీతో తవ్వేందుకు రాగా రైతులు అడ్డుకోవడంతో చేసేది లేక వెనుతిరిగారు. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని నిమ్మలపాలెం గ్రామ రెవెన్యూ పరిధి రావి చెరువు నుంచి అలువు పారే గెడ్డ పోరంబోకు భూములు వరకు ఆ గ్రామానికి చెందిన ఆయకట్టు రైతులు తమ పొలాల్లోకి రాకపోకలకు, పండిన పంటలను తెచ్చుకునేందుకు, చెంతనే గల అడ్డూరువానిపాలెం గ్రామానికి రాకపోకల కోసం మూడేళ్ల కిందట గ్రావెల్ రోడ్డును నిర్మించుకున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఎటువంటి ఇబ్బందులు లేవని 2021 సంవత్సరంలో ఇరిగేషన్ ఈఈ ఎన్‌ఓసీ సైతం జారీ చేశారు. దీంతో రోడ్డుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని అప్పటి ఎమ్మెల్యేకి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో రైతులు వినతిపత్రాన్ని అందజేయగా రూ.40 లక్షలు మంజూరు చేశారు. తీరా పనులు ప్రారంభమైన తరువాత బిల్లులు సక్రమంగా ఇవ్వకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలేశారు. దీంతో రైతులు చందాలు వేసుకొని గ్రావెల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్నారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు గెడ్డపోరంబోకులో అనుమతుల్లేకుండా రోడ్డు వేసేశారని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో డిప్యూటీ ఎంపీడీవో శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రహిమాన్ జేసీబీతో రోడ్డును తవ్వేందుకు గురువారం స్థలం వద్దకు వచ్చారు. రైతులకు సౌకర్యంగా ఉన్న రోడ్డును ఎలా తవ్వేస్తారని అధికారులను నిలదీశారు. చెరువు కింద ఆయకట్టు లేని వ్యక్తులు ఫిర్యాదు చేస్తే ఎలా వస్తారని అధికారులను ప్రశ్నించారు. మధ్యాహ్నం 1 గంట వరకు రోడ్డును తవ్వేందుకు అధికారులు యత్నించగా అదే రీతిలో రైతులు కూడా ఎదురుతిరిగారు. చివరకు చేసేది లేక అధికారులు వెనుతిరిగారు. ఇదిలా ఉండగా తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మెగా పీటీఎంలో విద్యార్థుల అవస్థలు

- సమావేశానికి రెండు గంటల ఆలస్యంగా మంత్రి రాక
- ఆకలితో అలమటించిన విద్యార్థులు

దత్తిరాజేరు: మండలంలోని మరడాం ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్ మీటింగ్ తూతూ మంత్రంగానే జరిగింది. ఉదయం తొమ్మిదిన్నర గంటలకు వస్తామన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ 11.30 గంటలకు వచ్చి రెండు గంటల వరకు సమావేశాన్ని కొనసాగించడంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. ఉదయం 9.30 గంటల న ఉంచి వేచి ఉన్న విద్యార్థుల ఆకలి కేకలు అధికారులకు పట్టలేదు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కార్యక్రమంలో అధికారుల కంటే తెలుగు తమ్ముళ్లు అత్యుత్సాహం ప్రదర్శించడంతో ఇదో రాజకీయ కార్యక్రమంలా మారిందన్న విమర్శలు వినపడ్డాయి. ముందుగా విద్యార్థులు, పేరెంట్స్ ఫొటో సెషన్ జరగాల్సి ఉన్నా జరగలేదు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ విజయభాస్కర్, ఎంఈవో సుధాకర్, సర్పంచ్ పోతల రామలక్ష్మి పాల్గొన్నారు.

మహాలక్ష్మి మైనింగ్‌లో అధికారుల పరిశీలన

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని దేవాడ రెవెన్యూ పరిధిలో గల మహాలక్ష్మి మైనింగ్‌ను డిప్యూటీ కలెక్టర్ ఇ.మురళీతో కలిసి భూగర్భజల అధికారి రాంబాబు, రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. మైనింగ్‌లో అనుమతులకు మించి తవ్వకాలు జరుగుతున్నాయని, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు డిప్యూటీ సీఎం కె.పవన్‌కల్యాణ్ ఆదేశాలతో సంబంధిత శాఖ అధికారులు మైనింగ్ ప్రాంతంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ ప్రాంతాన్ని, మ్యాప్‌ను పరిశీలించారు. మైనింగ్ యాజమాన్య ప్రతినిధులు ఎంత పరిధిలో అనుమతులు తీసుకున్నారు, ఎంత పరిధిలో ఏ మేరలో తవ్వకాలు జరుగుతున్నాయో పరిశీలించారు. ఈ తవ్వకాలు, తవ్వకాల పరిధికి సంబంధించి సర్వేయర్లతో సర్వే జరిపి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజుకు సూచించారు.



మైనింగ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్, మైనింగ్ అధికారులు

తడి, పొడి చెత్త సేకరణపై దృష్టి పెట్టండి

గజపతినగరం : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్త, వ్యర్థాలు వేయకుండా ప్రజలు సహకరించేలా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ అధికారులను జెడ్పీ జీఈవో పివివి.సత్యనారాయణ ఆదేశించారు. గజపతినగరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని ఆయన గురువారం తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రక్షిత మంచినీటి పథకం క్లీనింగ్, డోర్ టు డోర్ తడి, పొడి చెత్తల సేకరణ తదితర వాటిపై ప్రత్యేర దృష్టి పెట్టాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి.కల్యాణి, ఈవోపీఆర్‌డీ సుగుణాకరరావు, పంచాయతీ ఈవో జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని తనిఖీ చేస్తూ అధికారులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈవో సత్యనారాయణ

పొంచి ఉన్న ప్రమాదం

లక్కవరపుకోట : అరకు-విశాఖపట్నం జాతీయ రహదారిలో గోల్డుస్టార్ జంక్షన్ సమీపంలో గల ఎస్ ఆర్ పెట్రోల్ బంకు వద్ద రోడ్డుకు గల కల్వర్టు పైప్‌కు పెద్ద రంధ్రం ఎర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ రంధ్రం వద్ద రోడ్డు కృంగిపోయి ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం అరకును చూసేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు విశాఖ వరకు వచ్చి అక్కడ నుంచి అద్దె ద్విచక్ర వాహనాలపై అరకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా స్థానిక యువకులు రోడ్డు మధ్యలో కల్వర్టు పైప్ రంధ్రానికి కర్రలు పాతి గోనె సంచులను కట్టి ప్రమాద సూచికను వాహనదారులకు కనిపించే విధంగా గురువారం ఏర్పాటు చేశారు.



రోడ్డు మధ్యలో ఏర్పడిన రంధ్రానికి గోనె సంచులను కట్టిన యువకులు

ఓటరు జాబితాలు పారదర్శకంగా ఉండాలి



సమావేశానికి హాజరైన అధికారులు, బీఎల్‌వోలు

గజపతినగరం : ఓటరు జాబితాలో తప్పులు దొర్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత బీఎల్‌వోలపై ఉందని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రమీలాగాంధీ తెలిపారు. మండలంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నికల్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన బీఎల్‌వోల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, డెత్‌లు, తొలగింపులు తదితర వాటిపై ఇంటింటా సర్వే చేసి ఓటర్ల లిస్టు పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రత్నకుమార్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ

- 14న నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత సమావేశం
- జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



మాట్లాడుతున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, పక్కన మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ, పీఏసీ మెంబర్ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రతీ కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉందన్నారు. అందులో భాగంగానే తాజాగా బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమాన్ని రూపొందించినట్టు చెప్పారు. దీనికి సంబంధించి ఈ నెల 14న సోమవారం ఉదయం 10 గంటలకు గరివిడిలోని వి గ్రాండ్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశానికి శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ హాజరవుతున్నట్టు చెప్పారు. చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలన్నారు. ఆ సమావేశం తరువాత గ్రామాల్లో పర్యటించి బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంపై ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏడాదిలో జరిగిన మోసంపై విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, కొణిశ కృష్ణంనాయుడు, బమ్మిడి కార్తీక్, కోట్ల వెంకటరావు, తాడ్డి వేణు, పిఎస్‌ఆర్‌కె.ప్రసాద్ పొట్నూరు సన్యాశినాయుడు, శీర అప్పలనాయుడు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతి, స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వేలం

బొండపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల దాడులు చేసి పట్టుకున్న పీడీఎస్ బియ్యానికి గురువారం వేలం పాట నిర్వహించారు. ఇందులో కె.సూర్యనారాయణ కేజీ 25రూపాయిల 50పైసలు చొప్పున పాట దక్కించుకున్నట్టు సీఎస్‌డీటీ తిరుపతిరావు విలేకరులకు తెలిపారు.

పిల్లల కోసం తల్లిదండ్రులు సమయం కేటాయించాలి

గజపతినగరం రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమాజంలో అన్ని విధాలా తట్టుకుని నిలబడేలా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారని, అయితే పిల్లల తల్లిదండ్రులే వారి కోసం సమయం కేటాయించకపోవడం బాధాకరమని డిప్యూటీ డీఈవో మోహనరావు అన్నారు. మండలంలోని గంగచోళ్లపెంట గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో పేరెంట్స్, ఉపాధ్యాయులు ఆత్మీయ కలయికలో గురువారం పాల్గొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో బీఎల్‌వోల పాత్ర కీలకం

- ఇంచార్జ్ ఆర్డీవో ఆశియ్య

చీపురుపల్లి: సమర్థవంతమైన ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రక్రియలో బీఎల్‌వోల పాత్ర చాలా కీలకమని ఇంచార్జ్ ఆర్డీవో బి.ఆశియ్య చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో గురువారం మెరకముడిదాం, గుర్ల మండలాలకు చెందిన బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు 50 మంది బీఎల్‌వోలు చొప్పున దశల వారీగా శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఓటర్ల జాబితాలను సమర్థవంతంగా రూపొందించడంలో బీఎల్‌వోలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓటర్ల నమోదు ప్రక్రియలో వినియోగించాల్సిన ఫారం 6, 6ఏ, 7, 8లను ఏ సందర్భాల్లో ఎలా వినియోగించాలి, ఎలా విచారణ జరపాలనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించడం బీఎల్‌వోల బాధ్యతన్నారు. అలాగే అర్హత లేని వారిని జాబితాల్లో తొలగించడం కూడా అంతే బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్థిని తదితరులు పాల్గొన్నారు.



బీఎల్‌వోల శిక్షణలో మాట్లాడుతున్న ఇంచార్జ్ ఆర్డీవో ఆశియ్య

నిరవధిక సమ్మెకు మద్దతు ఇవ్వండి



మద్దతు ఇవ్వాలని కోరుతూ ఐక్యత చాటుతున్న యూనియన్ నాయకులు

విజయనగరం గంటస్తంభం: ఇంజినీరింగ్, నాన్ పీహెచ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి నుంచి చేపట్టే నిరవధిక సమ్మెకు మద్దతు ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కోరుతున్నారు. ఇదే విషయమై నగరంలోని ఎన్‌పీఆర్ భవన్, ప్రజాసంఘాల కార్యాలయం, కేఎల్ పురం నందు ఎస్.రామునాయుడు అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బేసిక్ వేతనం రూ.21 వేలు, టెక్నికల్ వేతనం రూ.24,500 ఇవ్వాలని సమావేశంలో ప్రభుత్వానికి యూనియన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఆ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహనరావు మాట్లాడుతూ 2023 డిసెంబరు 26 నుంచి జనవరి 10వ తేదీ వరకు 17 రోజులు సమ్మె జరిగిందని, అప్పటి మంత్రి వర్గం సంబంధిత అధికారులతో రాతపూర్వకంగా జరిగిన ఒప్పందాలకు నేటికీ జీవోలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆప్కాస్‌లో ఉద్యోగి అని నమోదు కావడంతో తల్లికి వందనంతో సహా సంక్షేమ పథకాలేవీ రావడం లేదన్నారు. ఎటువంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండానే 60 ఏళ్లకు రిటైర్‌మెంట్ చేస్తున్నారని, మృతి చెందిన వారి పిల్లలకు కూడా ఉపాధి కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. థర్డ్ పార్టీ కార్మికులకు పక్కాగా ప్రతి నెలా 10వ తేదీలోపు జీతాలు చెల్లించాలని, పండగ, జాతీయ సెలవు దినాలు, సిక్, క్యాజువల్ లీవులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.సుధారాణి, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షుడు బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

గురుపౌర్ణమి వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిర్డీ సాయి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షీరాభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పలుచోట్ల అన్నదానం చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



లక్కవరపుకోట : గోల్డుస్టార్ జంక్షన్ వద్ద షిర్డీ సాయి ఆలయంలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని ఆలయంలో ప్రత్యేక అలంకరణలో సాయినాథుడు



దత్తిరాజేరు: గడసాం ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



చీపురుపల్లి: దత్తసాయి మందిరంలో వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



జామి: పూజలందుకుంటున్న సాయిబాబా